REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com



జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :

janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 2 | సంచిక : 228 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 26-04-2024 | పేజీలు : 5

## జగన్‌కు తల్లి, చెల్లి ఎందుకు దూరమయ్యారో చెప్పాలి?


**చంద్రబాబు**



**రైల్వే కోడూరు. ఏప్రిల్ 25 (జనస్వరం) :** సీఎం జగన్‌కు తల్లి, చెల్లి ఎందుకు దూరమయ్యారో చెప్పాలని తెదేపా అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. జగన్‌కు వాడుకోవడం.. వదిలేయడం అలవాటేనని విమర్శించారు. అన్నమయ్యజిల్లా రైల్వేకోడూరులో చంద్రబాబు, పవన్ ఉమ్మడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని పోరాడినందుకు అంగళ్లులో తనపై, తెదేపా కార్యకర్తలపై.. వైకాపా మూకలతో దాడి చేయించారని చంద్రబాబు మండిపడ్డారు. నడమంత్రపు సిరి రావడంతో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. "వివేకాను చంపింది ఎవరు? హంతకుడిని పక్కన పెట్టుకుని.. దేవుడికే తెలియాలి అంటారు. వివేకాను హత్య చేస్తే.. గుండెపోటు అని సాక్షిలో చెప్పారు. కుటుంబంలోని గొడవలను మనపైకి నెడుతున్నారు. తగాదాలు ఒంటే మీరు మీరు తేల్చుకోవాలి. ఎన్నికల వేళ జగన్ అమాయకపు ముఖం పెట్టి సానుభూతికి యత్నిస్తారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వ్యక్తికి వైకాపా టికెట్ ఇచ్చింది. వైకాపా హయాంలో స్మగ్లర్లను పెంచి పోషించారు. రాష్ట్రాన్ని దోచేసిన వ్యక్తి జగన్. ఐదేళ్లు పరదాల చాటున తిరిగిన జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఏ ముఖం పెట్టుకుని ఓటు అడుగుతారు. జగన్‌లాంటి ముఖ్యమంత్రిని నా జీవితంలో చూడలేదు. వైకాపా పాలనలో 9 సార్లు కరెంటు బిల్లులు పెంచారు" అని చంద్రబాబు అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమన్నారు. వైకాపా అరాచకాలను ఎదురించేందుకు యువత ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఇవాళ డబ్బుకు లొంగని నవతరం ఉంది.. మీ వెనుక మేమున్నాం అంటూ యువతకు భరోసా ఇచ్చారు.

### వైకాపాని పాతాళానికి తొక్కేద్దాం..

## కూటమి ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం : పవన్



**రాజంపేట, ఏప్రిల్ 25 (జనస్వరం) :** వైకాపా ప్రభుత్వాన్ని పాతాళానికి తొక్కేద్దాం.. కూటమి ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. రాజంపేటలో నిర్వహించిన తెదేపా, భాజపా, జనసేన ఉమ్మడి సభలో పవన్ మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి తీసుకొచ్చిన రౌడీయిజం, ఫ్యాక్షనిజం అంతం కావాలంటే కూటమి ప్రభుత్వం రావాలన్నారు. "రాజ్యాధికారం కొన్ని కుటుంబాల చేతుల్లోనే ఉంది.. ఇది మారాలి. ఓడిపోతామని తెలిసి జగన్.. 70 నియోజవకర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చారు. అందులో రాజంపేట మొదటిది. సారా వ్యాపారం చేసుకునే మిథున్‌రెడ్డి నేను పోటీ చేస్తున్న పిఠాపురం వచ్చి నన్ను ఓడిస్తారట. యువత తలచుకుంటే మార్పు ఎందుకు రాదు? పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిని ఎదుర్కొనే గుండె బలం యువతకు లేదా? ఉపాధి అవకాశాలు లేక యువత రోడ్లపై తిరుగుతున్నారు. సంపదంతా పెద్దిరెడ్డి, ఆయన సోదరుడు, కుమారుడు మిథున్‌రెడ్డి వద్దే ఉండిపోయింది. అన్నమయ్య డ్యామ్ ప్రమాదంలో ఉందని ముందే హెచ్చరించారు. డ్యామ్‌లో ఇసుక తోడేయడం వల్ల 39 మంది చనిపోయారు. డ్యామ్‌లు కొట్టుకుపోతున్నా పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి పట్టించుకోరు. ప్రశాంతంగా కూర్చుని మద్యం వ్యాపారం చేసుకుంటున్నారు. రాజంపేట ప్రాంతానికి పరిశ్రమలు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి ముఠా నేతలు రూ.10వేల కోట్ల జీఎస్టీ ఎగ్గొట్టారు. " అని పవన్ విమర్శించారు.

# పులివెందుల అంటే నాకు ప్రాణం



- ప్రతి కష్టంలో వెన్నంటి నిలిచిన మీ రుణం తీర్చుకుంటా
- వైయస్సార్ కీర్తిని దెబ్బతీసేందుకు కుట్రలు
- పసుపు చీర కట్టినోళ్ళు వైయస్ వారసులా ..
- అవినాష్ చాలా మంచోడు
- అందుకే ఎంపీ టికెట్ ఇచ్చా
- పులివెందులలో సీఎం వైఎస్ జగన్

**పులివెందుల ఏప్రిల్ 25 (జనస్వరం) :** పులివెందుల అంటే నాకు ప్రాణానికి ప్రాణం అని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ వేసేందుకు గురువారం ఆయన పులివెందులకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక సిఎస్ఐ చర్చ్ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ. దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కీర్తి ప్రతిష్టలను దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు కుట్రలు పన్నుతున్నారన్నారు. పసుపు చీర కట్టినవాళ్లు వైయస్సార్ వారసులా అని ప్రశ్నించారు. చిన్నాన్న వివేకానంద్ రెడ్డిని ఎవరు చంపించారో జిల్లా ప్రజలకు తెలుసు అన్నారు. ఈ హత్యా నేరాన్ని అవినాష్ రెడ్డి పై వేసేందుకు తోడేళ్లన్నీ ఏకమయ్యాయి అన్నారు, కుట్ర దారులతో చేతులు కలిపిన వాళ్లు వారసుల అంటూ మరో మోరు ఆయన ప్రశ్నించారు. అవినాష్ రెడ్డి జీవితాన్ని నాశనం చేసేందుకు ప్రత్యర్థులు కంకణం కట్టుకున్నారన్నారు. వాస్తవానికి అవినాష్ రెడ్డి చాలా మంచోడని, కడప ఎంపీ టిక్కెట్టు ఇచ్చానని స్పష్టం చేశారు. పులివెందుల ప్రాంతం అభివృద్ధిలో పరుగులు తీస్తుంటే పచ్చదొరలకు ఇవేమీ కనబడనట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా మీడియా, చంద్రబాబు, దత్తపుత్రుడు, వదిన పనిగట్టుకుని తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు. పులివెందుల ఒక విజయగాథ. మంచి చేయడం, మాట తప్పకపోవడం మన కల్చర్ అన్నారు. టీడీపీ మాఫియా నాలుగు దశాబ్దాల దుర్మార్గాల్ని ఎదురించింది పులివెందుల బిడ్డలే అన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న పులివెందులకు కృష్ణా నది నీళ్లు వస్తున్నాయని తెలిపారు.. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ మనపై వేలెత్తి చూపిస్తున్నారున్నారు. ఈ అభివృద్ధికి కారణంగా వైఎస్సార్ అన్నారు. వైఎస్సార్, జగన్‌లపై లేనిపోని ముద్రలు వేసి దెబ్బతీయడానికి చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ ప్రయత్నిస్తున్నారని ఈ మధ్య కాలంలో కొత్తగా వైఎస్సార్ వారసులమని.. వారి కుట్రలో భాగంగా ప్రజల మధ్యకు వస్తున్నారన్నారు. వైఎస్సార్ కుటుంబాన్ని టార్గెట్ చేసింది ఎవరు? నాన్న గారిపై కక్షతో, కుట్రతో ఆయనపై కేసులు పెట్టింది ఎవరు?. ఆ కుట్రలు చేసిన పార్టీలో చేరిన వాళ్లు.. వైఎస్సార్ వారసులా అని ప్రశ్నించారు. ఆ మహానేతకు వారసులు ఎవరిని చెప్పాల్సింది ప్రజలే అన్నారు. వైఎస్సార్ లెగసీని లేకుండా చేయాలని చూసింది ఎవరు? వైఎస్సార్ పేరును సీబీఐ ఛార్జ్‌షీట్‌లో చేర్చింది ఎవరు?. అంటూ ప్రశ్నించారు. వైఎ?స్సార్ కుటుంబాన్ని టార్గెట్ చేసింది ఎవరు? మీ బిడ్డను ఎదుర్కోలేక.. ఒక్కరి మీదకు ఇంతమంది ఏకమైతున్నారని కానీ సంక్షేమం అభివృద్ధిలో వైఎస్సార్ బాటలో మరో రెండు అడుగులు ముందుకు వేసింది మన ప్రభుత్వమే అన్నారు. – పసుపు చీర కట్టుకుని వాళ్ల కుట్రలో భాగమైన వీళ్లా వైఎస్సార్ వారసులు?. వైఎస్సార్‌పై కుట్రలు చేసిన వాళ్లు ఇస్తున్న స్క్రిప్టులు చదువుతున్న వాళ్లు.. వైఎస్సార్ వారసులా?. అని మరో మారు ప్రశ్నించారు. అవినాష్ ఏ తప్పు చేయలేదని నేను నమ్మాను కాబట్టే.. టికెట్ ఇచ్చానని తెలిపారు.. వివేకాను చంపిన నిందితుడికి మద్దతిస్తుంది ఎవరు? వివేకాకు రెండో భార్య ఉన్నది వాస్తవం కాదా? అవినాష్ రెడ్డి లేవనెత్తిన ప్రశ్నలు సహేతుకమే కదా అని అన్నారు. రాబోవు ఎన్నికలల్లో కుట్రదారులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.


## ఇందిరాగాంధీ సంపదను కాపాడుకునేందుకే..

**కాంగ్రెస్‌పై మోదీ ఫైర్**



**భోపాల్, ఏప్రిల్ 25 (జనస్వరం) :** కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచు కుపడ్డారు. 'వారసత్వ పన్ను' వ్యవహారంలో తన ఆరోపణలను తీవ్రతరం చేశారు. తన తల్లి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మరణానంతరం ఆమె సంపద ప్రభుత్వానికి వెళ్లకుండా కాపాడుకునేందుకే.. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ 'వారసత్వ పన్ను'ను రద్దు చేశారని ఆరోపించారు. తరాలపాటు దాని నుంచి లబ్ధి పొందిన ఆ పార్టీ.. ఇప్పుడు దాన్ని దేశ ప్రజలపై రుద్దాలని చూస్తోందని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని మురైనాలో మోదీ ప్రసంగించారు. "ఒక వేళ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. వారసత్వ పన్ను ద్వారా ప్రజల సంపాదనలో సగానికిపైగా లాక్కొంటుంది. యువరాజు (రాహుల్ గాంధీ) సలహాదారు వారసత్వ పన్ను విధించాలని సూచించారు" అని హస్తం పార్టీ సీనియర్ నేత శాం పిట్రోడాపై మోదీ మండిపడ్డారు. "ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైతే మీ కష్టార్జితమంతా దోచుకుంటుంది. ప్రజల ఆస్తులు, విలువైన వస్తువులను 'ఎక్స్‌-రే' తీయడం ద్వారా.. నగలు, చిన్న మొత్తం పొదుపులను జప్తు చేయాలని భావిస్తోంది. కానీ, భాజపా ఉన్నంత వరకు దీన్ని అనుమతించదు. మిమ్మల్ని దోచుకోవాలనే కాంగ్రెస్ ప్లాన్‌కు, మీకు మధ్య మోదీ ఒక గోడలా నిలబడతారు" అని ఓటర్లనుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఆరోపణలను కాంగ్రెస్ ఖండించింది. రాజీవ్ గాంధీపై చేసిన వ్యాఖ్యలను అబద్ధాలుగా పేర్కొంది. ఇదిలాఉండగా.. ప్రజల వద్ద ఉన్న బంగారం సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా 'పునఃపంపిణీ' చేస్తుం దని, మహిళల మంగళసూత్రాలనూ వదలదంటూ కాంగ్రెస్‌పై ప్రధాని ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హస్తం పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. మరోవైపు.. రాహుల్ గాంధీ తన ప్రసంగాలతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారని భాజపా ఆరో పించింది. ఇద్దరిపైనా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన ఈసీ.. కోడ్ ఉల్లంఘన కింద ఇరుపార్టీల అధ్యక్షులకు నోటీసులు జారీ చేసింది.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 26 ఏప్రిల్ 2024,

తిథి : శుద్ధ విదియ (ఉ.07:50 వ.కు)

నక్షత్రం : విశాఖ (తె.02:27వ.కు), అనూరాధ (27తా తె.03:41 వ.కు), బ్రహ్మముహూర్తం : తె.04:13 నుండి తె.05:01 వరకు,

రాహుకాలం : ఉ.10:31ల నుండి మ.12:05 వరకు,

యమగండం : మ.03:13ల నుండి సా.04:47 వరకు,

వర్జ్యకాలం : ఉ.06:40ల ఉ.08:34

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 26 ఏప్రిల్ 2024

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:37

సూర్యోదయం : ఉదయం గం. 05:52

జొహర్ : మధ్యాహ్నం గం. 12:14

అసర్ : సాయంత్రం గం. 03:28

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:36

ఇష : రాత్రి గం. 07:51




**జన స్వరం**

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..


అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా

## ఎడిటోరియల్

# రాజ్యాంగ భ్రష్ట అరాచకోత్సవం!

అధినేత కుర్చీలో కులాసాగా కూర్చుని అధికారులు సిద్ధం చేసిన రిపబ్లిక్ దినోత్సవం ప్రసంగాన్నిచదువుకుంటున్నాడు. ఈలోగా సెక్రటరీ వచ్చాడు.
"ఆఫీసర్లు కిందా మీదా పడి స్పీచేదో రాసుకొచ్చారు కానీ, నాకెందుకో కాస్త వెలితిగా ఉందయ్యా.." అన్నాడు అధినేత జనాంతికంగా.
సెక్రటరీ ఆ ప్రసంగం కాగితాన్ని తీసుకుని చూసి, "సర్... మీ అసంతృప్తి ఏంటో చెబితే తిరగ రాయిస్తానండి.." అన్నాడు వినయంగా.
"మనం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఏమేం చేశామో ఏకరువు పెట్టారు కానీ, ఇది చాలదయ్యా.." అన్నాడు అధినేత ఏదో ఆలోచిస్తూ.
"చిత్తం.. అక్కడికీ నేను చెప్పానండి. తమరు పవర్ లోకి వచ్చిం తర్వాత జనానికి జరిగిందంతా పోగుచేసి, కూసింతైనా దాన్నే మైక్రోస్కోపులో చూసి, జీళ్ల పాకం పట్టి, దిమ్మిశా చేసి, సాగదీసి, విశాలం చేసి భూతద్దంలో పెద్దగా చూపించాలని, ఆ పైన టెలిస్కోపులో చూపించినట్టు హంగామా గట్రా చేయాలని సూచించానండి. పాపం.. ఇంతకన్నా కుదరలేదనుకుంటానండి.." అన్నాడు సెక్రటరీ ఉన్నదున్నట్టుగా.
"అవుననుకో. కానీ అవతల ఎన్నికలొచ్చేస్తున్నాయా, మరీ సమయంలో స్పీచ్ ఇంత చప్పగా ఉంటే ఎలాగా అని ఆలోచిస్తున్నానయ్యా. నువ్వే ఏదైనా ఉపాయం చెప్పు.." అన్నాడు అధినేత.
ఆ మాటకి సెక్రటరీ ఉబ్బితబ్బిబ్బయిపోయి, "దాందేముంది సార్... ఉన్నదంతగా లేనప్పుడు, లేనిది ఉన్నట్టుగా, మీ పాలనలో లేనిదేదీ లేనట్టుగా, జనానికసలు సమస్యలనేవే లేనట్టుగా, తమరి హయాంలో ఎక్కడా లేని సంతోషమంతా ఉన్నట్టుగా, మీ పరిపాలన తీరు ప్రపంచంలో మరెక్కడా లేనట్టుగా, సామాన్యుల జీవితాలు స్వర్గంలో ఉన్నట్టుగా, ఇక్కడ ఉన్న అభివృద్ధి మరెక్కడా లేనట్టుగా, ఉన్నది ఉన్నట్టుగా కాకుండా, చెప్పేదేదేనా చెప్పిన చోట చెప్పకుండా చెప్పుకురావడం మీకలవాటేగా? అలా చెప్పేయండి సార్..." అన్నాడు హుషారుగా.
"హ్హా..హ్హా..హ్హా..హ్హో! బలే చెప్పావయ్యా.. సర్లే, అలాగే కానిచ్చేస్తాను. ఇంతకీ ఏంటివాళ విషయాలు?"
"మరేం లేదు సార్.. మీరు కాదనరనే ధైర్యంతో, మీ దగ్గర ఇన్నాళ్లుగా పని చేసిన చనువుతో, మీకు ముందుగా చెప్పకుండా, మీ అపాయింటుమెంటు కొందరికి ఇచ్చేశాను సార్.. వాళ్లు బయట కూర్చుని ఉన్నారు. తమరు కాదనకూడదు..."
"వార్నీ.. అప్పాయింటుమెంటంటే ఆయింటుమెంటనుకున్నావేంటయ్యా, ఎవరికి పడితే వారికి ఇచ్చేయడానికి? వచ్చేదెవరో తెలియకపోతే అప్పటికప్పుడు ఏం మాట్లాడతాం? తెలిస్తే వాళ్లనెలా బుట్టలో వేయొచ్చో ఆలోచించుకుని రమ్మనచ్చు... ఇంతకీ ఎవరు వాళ్లు?"
"భలేవార్సార్. మీకిబ్బంది కలిగిస్తానా? వాళ్లు మీ అభిమానులండి. ఇంకా చెప్పాలంటే తమ భక్తులండి. బాగా ఆరా తీసే ఈ రహస్య సమావేశం ఏర్పాటు చేశానండి..."
"సర్లె.. మరయితే వాళ్లని మన సీక్రెట్ ఛాంబర్ లోకి తీసుకురా.."
అధినేత అనుమతి ఇవ్వడంతో సెక్రటరీ ఉత్సాహంగా బయటకి వెళ్లి ఓ గుంపుని వెంట తీసుకుని వచ్చాడు. వాళ్ల చేతిలో పూలదండలు, పుష్పగుచ్ఛాలు ఉన్నాయి.
వాళ్లలో చూడ్డానికి మొరటుగా ఉన్న ఒకతను ఓ పెద్ద దండ పట్టుకుని చకచకా ముందుకొచ్చి అధినేత మెడలో వేశాడు.
"జగజ్జేతకీ జై.. జగజ్జెట్టీకీ జై.." అన్నాడు బొంగురుగొంతుతో. అతడితో పాటు వచ్చిన వాళ్లంతా పళ్లికిలిస్తూ చప్పట్లు కొట్టారు.




"ఎవరయ్యా మీరు.. ఈ జేజేలు దేనికి? నేనేం సాధించాననీ?" అన్నాడు అధినేత, లోపల ఆనందపడుతూనే, పైకి లేని వినయం చూపిస్తూ.
"అమ్మమ్మ.. ఎంత మాట! తమరు అలవోకగా చేసే పనులన్నీ మాలాంటి వాళ్లకు పెదబాల శిక్షలు కదండీ.. అందుకే ఓ విన్నపంతో వచ్చామండి.."
"ఏంటో మీ అభిమానం. వద్దంటే వినరు కదా. సరే.. ముందు మీరెవరో, ఏంటో చెప్పండి మరి.."
"మా గురించి ఉన్నదున్నట్టు చెబుతానండి. ప్రజల భాషలో చెప్పాలంటే నేనొక దగుల్బాజీనండి. ఇదిగో వీడొట్టి వెధవండి. వీడికంటే వాడొక అరెక్కువండి. అంటే వెధవన్నర వెధవన్నమాటండి. ఇక ఆడొక పుండాకోరండి. ఆ పక్కన నుంచున్నోడు తేనె పూసిన కత్తండి. ఇహ ఈయన తడి గుడ్డల్తో గొంతులు కోసే రకమండి.. మొత్తానికి మేమంతా అఖిలాంధ్ర దొంగ, దుండగ, దగాకోరు, దౌర్జన్యకారుల సంఘం సభ్యులమండి. నేనే అధ్యక్షుడినండి.."
అధినేత పగలబడి నవ్వాడు. "వహోర్నీ.. బాగుందయ్యా మీ ఇంట్రడక్సను. అయితే ప్రజల సొమ్ము దోచుకుంటున్నారన్నమాట. ఏ మాత్రం వెనకేశారేంటి?"
"శ్రీవారితో పోలిస్తే మేమెంతండి? గడ్డి మేసే గాడిదలం. తమరిలాగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఖజానాని పిండే తెలివెక్కడిదండీ?"
"సర్లె.. పొగడ్తలు ఆపి, విషయంలోకి రండి. నాకవతల చాలా పనులున్నాయి..."
"అదేనండి. రిపబ్లిక్ దినం వస్తోంది కదండి. ప్రజలతో మీ పబ్లిక్ సమావేశం పూర్తయ్యాక, మేం ఏర్పాటు చేసే మరో ప్రత్యేకమైన రీపబ్లిక్ రాత్రోత్సవ సభకు రావాలండి..."
"ప్రత్యేకమైన రీపబ్లిక్ రాత్రోత్సవమేంటయ్యా...?"
"మరేంలేదు సార్. రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాక, దాన్ని అమలు చేసుకునే రోజునే దేశమంతా రిపబ్లిక్ దినోత్సవం జరుపుకుంటుంది కదండీ? అదంతా పబ్లిక్ వ్యవహారమండి. కానీ తమరు అధికారంలోకి వచ్చాక ఆ రాజ్యాంగాన్ని తిరగరాస్తున్నారు కదండీ? రాజ్యాంగానికే వక్రభాష్యాలు చెబుతూ, రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలను నిర్లజ్జగా, నిస్సిగ్గుగా అమలు చేస్తున్నారు కదండీ? అంచేత మేం ప్రత్యేకంగా ఈ రీపబ్లిక్ రాత్రోత్సవాన్ని ఏర్పాటు చేశామండి. అంటే ఇది రాజ్యాంగ వ్యతిరేక రాత్రోత్సవమన్న మాటండి. అర్థరాత్రి మొదలవుతుందండి. తమరొచ్చి మేం ప్రత్యేకంగా తయారు చేసిన జెండాను ఆవిష్కరించి, మాలోంటోళ్లని ఉద్దేశించి ప్రసంగించాలండి. మాకదో తృప్తండి. కాదనకూడదు...."
అధినేత ముసిముసిగా నవ్వుకుని సరేనన్నాడు.
రాజ్యాంగ వ్యతిరేక రాత్రోత్సవం మొదలైంది. అధినేత వస్తుంటే మైకులో పాట మొదలైంది.
"వేలెత్తి ఎదురెట్టు మొరటోడా... గతమెంతో అపకీర్తి కలవోడా!"
అక్కడ హాజరైన సంఘ సభ్యులందరూ పూలు జల్లుతుంటే అధినేత, హుందాగా జెండా కొయ్య దగ్గరకి వచ్చి అక్కడ తాడు పట్టుకుని లాగాడు. వెంటనే జెండా ఆవిష్కృతమైంది. ఎర్ర మరకలున్న జెండాపై కత్తులు, కటార్లు, కళ్లగంతలు, బేడీలు లాంటి గుర్తులు ముద్రించి ఉన్నాయి. వెంటనే సభ మొదలైంది.
అధినేతను ఆహ్వానించిన అధ్యక్షుడు తన ఉపన్యాసం మొదలు పెట్టాడు.
"సంఘ వ్యతిరేక శక్తులారా! చట్ట విరుద్ధ మిత్రులారా! నేడు మనకు సుదినం. అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని విస్మరించి, దాన్ని తిరగరాసి, చరిత్రను వక్రంగా లిఖిస్తున్న మన అధినేత ఈ సభకు విచ్చేయడం మనందరికీ ఆనందదాయకం. మనమందరం నీచమైన పనులు చేసి, దొంగతనాలు, దోపిడీలు, దురాగతాలకు తలబడి చెడ్డవాళ్లమనే ముద్ర వేసుకుని తిరుగుతున్న వాళ్లమే. కానీ ఈయన? పైకి మంచిగా కనిపిస్తూ, అందరికీ మంచి చేయడానికే అవతారమెత్తినట్టు నమ్మిస్తూ మనందరి కన్నా ఎక్కువగా దోచుకుంటున్న ఘన నేత. మనం చేసే పనులను మనం దొంగతనంగా, భయపడుతూ చేస్తున్నాం. మరి ఈయన? ప్రజల పేరు చెప్పి, అభివృద్ధి చేస్తున్నట్టు పైకి చెబుతూ, ఏ పని చేపట్టినా, లోపాయికారీగా కమీషన్ల రూపంలో కోట్లకు కోట్లు చేతులు మారే వ్యవస్థను నెలకొల్పారు. ఇసుకని కాదు, మద్యమని కాదు, నీటి ప్రాజెక్టులని కాదు, కొండలని కాదు, గనులని కాదు, భూములని కాదు, పొలాలని కాదు... అన్నింటినీ ప్రగతి పేరిట బాహాటంగా, ఎక్కడా చట్టానికి దొరక్కుండా భోంచేస్తున్నమహా రాజకీయ నేత. ఒకప్పుడు ఇల్లు తాకట్టు పెట్టే స్థితి నుంచి ఈనాడు ఇతర రాష్ట్రాల్లో సైతం విలాసవంతమైన భవంతులు నిర్మించుకునే స్థితికి వెళ్లిన నాయకుడు. అధికారం లేకుండానే ఈయన నడిపిన అవినీతి కార్యకలాపాల లోగుట్టుమట్టులు తేల్చడానికి మహా మహా కోర్టులు సైతం కిందమీదులవుతున్నాయి. రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా తన అధికారానికి అనుగుణంగా సొంత రాజ్యాంగాన్ని రచించుకున్న ఈయనకు నేను ఈ సందర్భంగా 'రాజ్యాంగ భ్రష్ట' అనే బిరుదును సభా ముఖంగా సవినయంగా సమర్పించుకుంటున్నాను.." అనగానే చప్పట్లు మార్మోగాయి.
"ఇప్పుడు ఈయన మనందరి మేలు కోరి ప్రసంగించాలని, నీచ నికృష్ట పనులను చేయడంలో నైపుణ్యాలను వివరించాలని కోరుతున్నాను. ఈయన మాటలు విని మీరంతా మరింత చెడిపోవాలని కోరుతున్నాను..." అంటూ అధ్యక్షుడు, అధినేతను సాదరంగా మైకు ముందుకు ఆహ్వానించాడు.
అధినేత ముసిముసిగా నవ్వుతూ, "అసలిలాంటి వినూత్నమైన రీపబ్లిక్ ఉత్సవాన్ని జరపాలనే ఆలోచన వచ్చినందుకు ముందుగా మిమ్మల్ని అభినందిస్తున్నాను. మీ అభిమానం చూస్తుంటే ఆనందంగా ఉంది. కాబట్టి నాకు తెలిసిన కొన్ని చెడ్డ మాటలు చెబుతాను. మీరంతా ముందు చూపులేని సాదాసీదా అమాయక నేరగాళ్లు. నేనలా కాదు. రానున్న కొన్నేళ్లపాటు నిరాటంకంగా, నిరంతరాయంగా, నిర్భయంగా, నిశ్చింతగా, నిబ్బరంగా కోట్లకు కోట్లు దోచుకోడానికి పథక రచన చేసిన రాజకీయ వేత్తను. అన్నింటికన్న పెద్ద సంపద ప్రజా ధనం. దాన్ని దోచుకోవాలంటే అధికారం రావాలి. అది రావాలంటే ప్రజలను నమ్మించాలి. నిజానికి అదొక కళ. ఒకసారి అధికారం అందాక అమాత్యుల నుంచి అధికారుల వరకు, అస్మదీయుల నుంచి అనుచరుల వరకు అందరికీ అవినీతిని రుచి చూపించాలి. ఒక విధంగా అవినీతిని కేంద్రీకరించాలి. వ్యవస్థీకృతం చేయాలి. అందుకుగాను రాజ్యాంగ, చట్ట, న్యాయ, ప్రజాస్వామ్య వ్యవస్థలను, విధానాలను ఒకటొకటిగా భ్రష్టు పట్టించాలి. ఈ ప్రయాణంలో ఎన్ని ఆటంకాలెదురైనా జంక కూడదు. ప్రశ్నించే వాళ్లను, మన చర్యలను నిరసించే వాళ్లను కర్కశంగా అణచివేయాలి. ఇందుకు చట్టంలో లొసుగులను వాడుకోవాలి. రాజ్యాంగంలోని లోపాలను ఉపయోగించుకోవాలి. నేను చేసిందదే. ఇన్ని పనులు చేస్తున్నా మనం అధికారంలోకి రావడానికి దోహద పడే ఓటు బ్యాంకును మాత్రం విస్మరించకూడదు. వాళ్లకి కూడా డబ్బు రుచి చూపించాలి. ప్రజలు అమాయకులు. వాళ్లకు పది రూపాయలు పడేసి, వాళ్ల కళ్ల ముందే కోట్లకు కోట్లు దోచేసుకుంటున్నా పట్టించుకోరు. నిజానికి వాళ్లకి మనం పథకాల రూపంలో పంచేది కూడా వాళ్ల డబ్బేనని తెలుసుకోలేరు. ఇప్పటికే మీలాంటి వాళ్లను నా అనుచర వర్గంగా పెట్టుకున్నాను. మిమ్మల్ని కూడా ముందు ముందు ఉపయోగించుకుంటానని మాట ఇస్తున్నాను" అంటూ ముగించాడు.
ఆ అర్థరాత్రి అక్కడ చేరిన సభ్యులందరూ ఆనందంతో చప్పట్లు మోగించారు. ఆ తర్వాత 'భారత భ్రష్ట', 'చెడ్డశ్రీ', 'నీచ విభూషణ్', 'నికృష్ట రత్న' లాంటి పతకాలను అధినేత ప్రదానం చేశాడు. శకటాలుగా ప్రదర్శించిన దోపిడీ ధనం, తుపాకులు, బందూకులు, బాంబులు, గ్రెనేడ్లులాంటి పరికరాలతో కూడిన వాహనాలను ఆనందంగా తిలకించాడు. దౌర్జన్యకారుల గౌరవ వందనం స్వీకరించాడు. ఈలోగా తెల్లారిపోయేసరికి ఎక్కడివారక్కడ జారుకున్నారు.

# "నాడు" గిరిజనుల ఉత్సవం.. కుంభోత్సవ సంబరం...




**శ్రీశైలం, ఏప్రిల్ 25 (జనస్వరం) :** అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకరైన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం వార్షిక కుంభోత్సవం శ్రీశైల దేవస్థానం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీశైల ఆచార సంప్రదాయా ఆచారాల్లో భాగంగా స్థానిక గిరిజనులకు (చెంచుకుటుంబాలు) అతి ముఖ్యమైన ఉత్సవం ఆనవాయితిలో భాగంగా ఉగాది మహెూత్సవాల అనంతరం మొదటి పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారాల్లో ఈ కుంభోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు ఈ నెల 26 వతేదీన ఈ కుంభోత్సవ కార్యక్రమాన్నినిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆరోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు శ్రీ భ్రమరాంబాదేవి ఆలయం మూసివేసి కాలపూజలు మాత్రమే నిర్వహిస్తారు. సాయంత్రం చంద్రోదయం అయిన తరువాత అమ్మవారి ఆలయం తెరచి అమ్మవారికి కేవలం పసుపు కుంకుమలతో పూజిస్తారు. అమ్మవారి గర్భాలయం తెరిచేటప్పటికే అమ్మవారి ముల విరాట్ విగ్రహానికి ఎదురుగా ముఖమండపంలోని మహాశక్తియంత్రం వెనుక భాగాన వండిన అన్నం రాశిగా పోసి అన్న కుంభోత్సవం నిర్వహిస్తారు. పూర్వం 1955 నుంచి దాదాపు 1990 సంవత్సరం వరకుఅమ్మవారి ఆలయప్రాంగణంలో కోటగొడ అమ్మవారి వద్ద కోళ్లు, మేకలను కుంభోత్సవం రాత్రి బలిచ్చేవారు. కాలక్రమేణా సాత్వికబలి దిశకు ఈ కుంభోత్సవం చేరుకుంది. ప్రస్తుతం కుంభోత్సవానికి వేలకొద్ది నిమ్మకాయలు, గుమ్మడికాయలు, కొబ్బరి కాయలు అమ్మవారికి సాత్వికబలిగా సమర్పిస్తున్నారు. అటు దేవస్థానంలో పాటుగా స్థానిక వ్యాపారస్తులు క్షేత్రం సుభిక్షంగాఉండాలని కోరుకుంటు వందల కేజీల అన్నం పెసరపప్పుతో కూడిన కుంభాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. 6వ శతాబ్దంలో సాక్షాత్తు ఆదిశంకరా చార్యులు వామచార (బలుల)సంప్రదాయాన్ని స్వస్తి చెబుతూ దక్షిణాచార (సాత్వికబలి) సంప్రదాయాన్ని కొనసాగేలా అమ్మవారి ఉగ్రరూపాన్ని ఉపసంహరించి శ్రీ చక్రాన్ని ఏర్పాట్లు చేశారని ఆలయ చరిత్ర చెబుతుంది. నాడు శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల నుండి సమాచారం సేకరించడం జరిగింది.

**పూర్వం గిరిజనుల ఉత్సవం**

నేను శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కుంభోత్సవం గిరిజన కుటుంబాలు ప్రత్యేక పండుగ (ఉత్సవం)గా నిర్వహించుకునేవారు. ఆలయ ప్రాంగణమంతా శ్రీశైలానికి దరిదాపుల్లో ఉన్నటువంటి గిరిజన గూడెంలనుండి వచ్చిన గిరిజనుల (చెంచు)తో నిండిపోయేది వారి సంప్రదాయ రీతిలో నృత్యాలు చేస్తూ కోళ్లను, మేకలను బలిఇచ్చేవారు చాలాకాలం వరకు ఈ సంప్రదాయం కొనసాగింది ఎంతో కనులపండుగగా ఈ కుంభోత్సవం జరిగేది. 1990 సంవత్సరం తదుపరి క్రమంగా ఆసాంప్రదాయానికి తెరపడి సాత్వికబలి దిశగా సాగుతూ వస్తుంది.

**– పి.దర్గయ్య విశ్రాంత ఉద్యోగి**

# ప్రపంచ మలేరియా దినోత్సవంపై ర్యాలీ



**పులివెందుల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాషిని మాట్లాడుతూ ఆఫ్రికా దేశాలలో మలేరియా తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆఫ్రికా మలేరియా డేగా జరుపుకునేవారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ మలేరియా దినోత్సవాన్ని ఆఫ్రికా దేశాలలో కాకుండా ప్రపంచ వ్యాప్తంగా జరపాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ మే 2007లో కౌన్సిల్ సమావేశాన్ని నిర్ణయించిందని, అందుకే ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్న జీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడ అనాఫీలిస్ అనే దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. ఈ దోమల ద్వారా ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సీపారం, అనే జాతికి చెందిన రెండు రకాలు పేరసైట్స్ వలన మన ప్రాంతంలో మలేరియా నమోదు అవుతాయని తెలిపారు. పేరసైట్స్ ఉన్న ఆడ అనాఫీలిస్ దోమ కుట్టడం వలన ఏడు నుండి పది రోజుల లోపల మలేరియా జ్వరం వస్తుందని, జ్వరం వచ్చిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనకు వచ్చినట్లు అయితే రక్తపరీక్షలో నిర్ధారించిన ప్లాస్మోడియం రకాన్ని బట్టి వైద్యాధికారి తగు చికిత్స అందించడం జరుగుతుంది అని డాక్టర్ సుభాషిణి అన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ మలేరియా నిర్ధారణ అయినవారికి ప్లాస్మోడియం వైవాక్స్, అయితే 14 రోజులు, ప్లాస్మోడియం ఫాల్సీపారం అయితే 3 రోజులు సంబంధిత మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవ్వరికైనా మలేరియా సోకినట్లు అయితే ఆ గ్రామంలోని ప్రతి ఒక్కరికీ రక్తపరీక్షలు నిర్వహించి దోమల నివారణ కొరకు డిడిటీ పచికారి చేయనున్నట్లు సిద్ధయ్య అన్నారు. సిహెచ్ఓ శివరాం మాట్లాడుతూ నీరు నిల్వ ఉంచిన తొట్లు, ఇతర పాత్రలు మూసీ ఉంచాలని, ఇంటిలో ఉన్న నీటి కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను ధరించాలని, దోమతెరలను తప్పనిసరిగా వాడాలని శివరాం అన్నారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్.ఎన్.కుసుమ కుమారి, సూపర్ వైజర్, హషియా బేగం అరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్

**తండోపా ఖండాలుగా తరలిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు**



**కుక్కునూరు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్ సందర్భంగా కుక్కునూరు మండలం నుండి టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో వందలాదిగా కార్యకర్తలు తరలి వెళ్లారు. ఉదయం 11 గంటలకు ఎన్డిఏ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు నామినేషన్ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ రావడంతో అటు టీడీపీ నుండి ఇటు జనసేన నుండి 60 మ్యాజిక్కులు 20 ఆకార్లతో ర్యాలీగా కుక్కునూరు నుండి బయలుదేరి వెళ్లడం జరిగింది. దీనికి ముందుగా కుక్కునూరు మండల టీడీపీ అధ్యక్షులు మొలిశెట్టి నాగు మాట్లాడుతూ ఈ అరాచక పాలన అంతమందించాలంటే తప్పనిసరిగా కూటమి అభ్యర్థిని గెలిపించాలని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసే ఏకైక వ్యక్తి చంద్రబాబు అని, వారితోటే అభివృద్ధి సాధ్యమని నమ్మి జనం స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళ నాయకురాలు ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డ్ మెంబెర్స్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణమాసంలో సొంతింటి తాళాలు ఇచ్చే బాధ్యత నాది

**సైకిల్‌పై పేపర్ వేసి.. ఎమ్మెల్యే నిమ్మల నిరసన**



**పాలకొల్లు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పాలకొల్లులో అర్హులైన పేదలు, మహిళలకు టిడ్కో ఇళ్ళ తాళాలు అందించే బాధ్యత నాదని, ఆగస్టులో వచ్చే శ్రావణమాసంలో ఉచితంగా టిడ్కో ఇళ్ళు అందజేస్తా నని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో జగన్ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేసి ఇవ్వనందుకు నిరసనగా గురువారం తెల్లవారుజామున ఆయన సైకిల్‌పై ఇం టింటికి తిరుగుతూ పేపర్ వేసి వినూత్న నిరసన తెలిపారు. దారి పొడవునా ప్రజలను పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరో 30 రోజుల్లో మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని అందరికీ మేలు జరుగుతుందని ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామానాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన ఇళ్లకు, అధి కారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం అరబస్తా సిమెంట్ ఖర్చు చేసి మిగిలిన పని పూర్తి చేయలేకపోయిందన్నారు. గత ఎన్నికల్లో ఇళ్ళను ఉచితంగా ఇస్తామని జగన్ హామీ ఇచ్చి మాట తప్పడమే కాకుండా బ్యాంకులకు ఇళ్లను తాకట్టు పెట్టి రూ.10 లక్షలు చొప్పున రుణభారం మోపాడ ంటూ విమర్శించారు. అమరావతిలో మొద్దు నిద్రపోతున్న జగన్‌ను నిద్రలేపేందుకే ఆందోళన కార్య క్రమాలు దశలవారీగా చేపట్టినట్లు తెలిపారు. దీని ఫలితంగా కొద్దిమందికి మాత్రమే గృహాలను ఇచ్చారని, మరో 80 శాతం మంది వరకు మిగిలి ఉన్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాగళం సభలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం అందరికీ ఇళ్లు ఉచితంగానే ఇవ్వడం జరు గుతుందని ఎమ్మెల్యే రామానాయుడు స్పష్టం చేశారు.

# రాంటేక్ గ్రామంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

- పంచశీల జెండా ఆవిష్కరణ చేసిన దళిత ప్రజలు.
- అణగారిన వర్గాల గొంతుక అంబేడ్కర్
- నివాళులర్పించిన అంబేడ్కర్ సంఘం సభ్యులు...




**ముథోల్ ఏప్రిల్ 25 (జనస్వరం) :** రాంటేక్ గ్రామంలోభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సంఘం సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సిద్ధాంతాలు నవ సమాజ నిర్మాణం కోసం పోరాటయోధుడు భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న అవార్డు గ్రహీత, ప్రపంచ మేధావి సమాజంలో ఓటును ఆయుధంతో ప్రపంచాన్ని మార్చగల శక్తి ఓటు హక్కు కలిగి ఉందని చెప్పిన మహానుభావుడు అని కొనియాడారు. అంబేద్కర్ మన భారత రాజ్యాంగానికి ప్రధాన రూపశిల్పి. స్వతంత్ర్య భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి కూడా ఆయనేనని దేశంలోనే ప్రముఖ న్యాయనిపుణుడిగా, ఆర్థిక వేత్తగా, సంఘ సంస్కర్తగా అంబేద్కర్ ఎంతో ప్రసిద్ధి చెందారని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాణంలోనే కాదు, దళిత సమాజ అభ్యున్నతిలోనూ అంబేద్కర్ పాత్ర అమోఘమైనది. అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని, చిన్న నాటి నుంచి తీవ్ర సామాజిక వివక్షను ఎదుర్కొన్న అంబేద్కర్, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకున్నారని తెలిపారు. ఆయన తన చదువును, తన తెలివిని అణగారిన వర్గాల సాధికారత కోసమే ఉపయోగించి తన జీవితంలో ఎక్కువ భాగాన్ని పేదల అభ్యున్నతి కోసమే అంకితం ఇచ్చారు. బడుగు బలహీనవర్గాల వారు ప్రేమగా బాబా సాహెబ్' అని పిలుచుకునే అంబేద్కర్ జీవితం నేటికీ ఎంతోమందికి ఆదర్శమన్నారు. ఆయన మాటలు పేదలు తమ హక్కుల కోసం తమ గళాన్ని వినిపించేలా ప్రేరేపిస్తాయి. ఆయన సూక్తులు ప్రజలు ధర్మం వైపు, న్యాయం వైపు నడిచేలా చేస్తాయి. అల్పులు అని తమ ఆర్థిక, అధికారిక, రాజకీయ బలంతో అణగదొక్కే అహంకారులకు అంబేద్కర్ చూపిన బాట ఒక తిరుగుబావుట. ఆయన బలహీనుల వెనక బలం బడుగుజీవుల కీర్తి తిలకం, అందుకే ఆయన స్మృతులు ఎప్పటికీ చిరస్మరణీయం ఉంటుందని కొనియాడారు. అంబేద్కర్ జయంతిని భీమ్ జయంతి అని కూడా అంటారు. జై భీమ్ జయహో భీమ్ అని నినదిస్తారని పేర్కొన్నారు. అంబేద్కర్ రామ్‌జీ మలోజీ సక్‌పాల్‌కి 14వ చివరి సంతానం. నిరుపేద కుటుంబం నుండి వచ్చిన దళితుడు అయిన బాబాసాహెబ్ తన సంఘంలో జరిగిన అకృత్యాలను, వివక్షను కళ్లారా చూశారు. పాఠశాలలో, దళిత పిల్లలను నీటి పాత్రను ముట్టుకోనివ్వరు. ఉన్నత కులానికి చెందిన ఎవరైనా వారికి నీరు పోస్తారు. బాబాసాహెబ్‌ను తరగతి లోపల కూర్చోనివ్వలేదు. గోనె సంచి మీద కూర్చునేవారని పేర్కొన్నారు. అంబేద్కర్ ఇటువంటి దురాచారాలను అంటరానితనం, కుల ప్రాతిపదికన వివక్ష వంటి సాంఘిక దురాచారాలను తీవ్రంగా వ్యతిరేకించారు. తన జీవితాంతం అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త. ఆయన అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడు. స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి. ఎన్నో న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారు మొదట్లో న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు అంటరానితనం, అవిద్యపై పోరాడారు. మొత్తం భారతదేశ చరిత్రలోనే చిరస్మరణీయంగా నిలిచిన నాయకుడు. ఆయన చేసిన విశేష కృషికి ఆయన పుట్టినరోజును అంబేద్కర్ జయంతిగా జరుపుకుంటున్నామని సంతోషం వ్యక్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, చిన్న పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

- తెలంగాణకు దశా దిశా సీఎం రేవంత్ రెడ్డి,
- మల్కాజ్‌గిరి ఎంపీ స్థానం ముమ్మాటికి కాంగ్రెస్‌దే
- తోటకూర వజ్రేశ్ యాదవ్



**కీసర, ఏప్రిల్ 25 (జనస్వరం) :** కాంగ్రెస్ హాయంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందని మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,మేడ్చల్ కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తోట కూర వజ్రేష్ యాదవు,జిల్లా పరిషత్ చైర్మన్ మల్లిపెద్ది శరత్ చంద్ర రెడ్డిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కీసర మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీ బెలిదే రమేష్ గుప్తా,మాజీ ఉపసర్పంచ్ రాయల శ్రావణ్ కుమార్ గుప్తా, కీసరగుట్ట దేవాలయ మాజీ చైర్మన్ తటాకం రమేష్ శర్మ,సింగిల్ విండో మాజీ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మచ్చాని జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ఎట్ట మయ్య యాదవ్, మాజీ గ్రామపంచాయతీ సభ్యులు బండారి శంకర్ గౌడ్, పగిడిపాల రవి, స్థానిక నాయకులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుంటోల్ల దశరథ, శ్రీధర్ రెడ్డి, బెలిదే సాయినాథ్ గుప్తా, ముస్తఫా అలీ, కనకయ్య, పుట్ట శ్రీనివాస్ గౌడ్, కుంటోల్ల బాలమణిలకు కండువాలు వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యం లో రాష్ట్రం అప్పుల పాల అయిందని, మిగులు రాష్ట్రాన్ని కాస్త ఏడు లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయేలా చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. గత పది ఏళ్లలో రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలు ందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, నిరుద్యోగ యువత బాగోగులను పట్టించుకోలేదని విమర్శించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుపోయేందుకు సీఎం రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డితో రాష్ట్రంలో కాంగ్రెస్‌కి పూర్వ వైభవం వచ్చిందని వారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తుందని వారన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇవ్వాలని వారు కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీతోనే పోటీ ఉంటుందని, బీఆర్ఎస్ ఎన్నికల తర్వాత కనుమరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తటకం వెంకటేష్ శర్మ, కందాడి అంజిరెడ్డి, రామిడి విజయ్ రెడ్డి, జూపల్లి సాయిలు, రామిడి స్వప్న రెడ్డి, జూపల్లి రవి, పోలగని దయానందం గౌడ్, చిక్కుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఉల్లాసానికి దోహదపడేవి క్రీడలు

**సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంపీపీ అనూష దేవి సర్పంచ్ పుష్పలత**



**చింతపల్లి ఏప్రిల్ 26 (జనస్వరం) :** మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో కలిసి ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ద యూనిటీ కప్ సెకండ్ సిరీస్ హార్డ్ టెన్నిస్ బాల్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా క్రీడాకారులను వారు పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు దాతలు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించారన్నారు. ఈ టోర్నమెంట్ లో ప్రథమ విజేతకు 50 వేల రూపాయలు, ద్వితీయ విజేతకు 20 వేల రూపాయల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు అదే క్రమంలో నల్లల శివ సాయి వీడిఎస్ ఆర్థిక సహకారంతో విన్నర్ ట్రోఫీ, కేపీ రాజు ఆర్థిక సహాయంతో రన్నర్ ట్రోఫీ, స్థానిక ఎంపీటీసీ దారలక్ష్మి, మత్యరాజు దంపతుల ఆర్థిక సహాయంతో బెస్ట్ టీం ట్రోఫీలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ఎంపీపీ అనూష దేవి 20వేల రూపాయలు, సర్పంచ్ పుష్పలత, హేమంత్ దంపతులు పదివేల రూపాయలు, స్థానిక ఇంజనీరింగ్ జేఈలు (జ్యోతి బాబు, లోకేష్ లు) 20వేల రూపాయలు, ప్రసాద్, నాగేంద్ర లు సంయుక్తంగా పదివేల రూపాయలు అందించారని, అదేవిధంగా టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన వివిధ అవసరాలను గ్రామంలోని యూత్ సమకూర్చాలని వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు లీలా పావని, కేజియా, సంతోషి, రమణ, బాలరాజు, జగదీష్ బాబు, నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# 27న పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్ష..



**నంద్యాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 27వ తేదీన పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు నంద్యాల పాలిసెట్ కోఆర్డినేటర్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాల ఆవరణలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బేతంచర్ల శ్రీశైలం నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలోని 18 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 5460 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు గంట ముందే హాజరు కావాలని సూచించారు. హాల్ టికెట్లు వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు అన్నారు. నంద్యాల జిల్లాలోని ప్రతి ఒక్క విద్యార్థి పరీక్ష పాలిటెక్ నిక్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. నంద్యాల కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ కూడా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మీడియా కోఆర్డినేటర్ గొట్టి ముక్కల సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**పాలకొల్లు, ఏప్రిల్ 24 (జనస్వరం) :** పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామంలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పాలకొల్లు నుండి బైక్ పై లంకలకోడేరు ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు ఇటుక ట్రాక్టర్ ను సరిగ్గా భగ్గేశ్వరం రైస్ మిల్లు ప్రాంతంలోకి వచ్చేసరికి బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో కొలికెల శ్రీజు అనే యువకుడు అక్కడి కక్కడే మరణించాడు. మరొక యువకుడు బన్ను కోమాలోకి వెళ్ళడంతో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నాసిరకం విత్తనాల ముఠా లీడర్ ఎంపీ పోచా

**మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**



**నంద్యాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** పార్లమెంట్ పరిధిలో వైసీపీ ఎంపీ పోచా ఎలాంటోడు అని ఎవరైన అడిగితే తూ.. నీ బతుకు చెడా అంటూ నాసిరకం విత్తనాల ముఠా లీడర్ అని రైతులే అంటున్నారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి బాధిత రైతుల సమక్షంలో విలేకరులతో బైరెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పోచా బ్రహ్మానందరెడ్డి నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టి తీవ్రంగా నష్టపుచ్చుతే భాదితులకు న్యాయం చేసేందుకు పంచాయతీ తానే చేసి పోచాతో రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చేసానన్నారు. ఎంపీ సొంత మండలం ఉయ్యాలవాడ, నీకు పరిశ్రమలు ఉన్న నంద్యాల మండలం చాబోలు, దొర్నిపాడు మండలం చాకరాజువేముల తదితర గ్రామాల నీ బాధిత రైతులతో ఈ రోజు విలేకరుల సమావేశం పెట్టానని, కనీసం ఆ రైతుల గోడు వినయ్య పోచా అంటూ బైరెడ్డి బాధితులతో వారి ఆవేదనను వినిపించారు. ఇలాంటి ఎంపీ మాకు ఒద్దు.. పోచాకు ఓట్లు వేయవద్దని.. నీ బాధిత రైతులే తోటి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నా ఇంకా నీలో మార్పు లేదేమయ్య అన్నారు. నీకు వ్యసాయం శాస్త్రవేత్తగా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన, పాలకమండలి పదవి ఇచ్చి గౌరవం కల్పించిన నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానాన్ని సర్వనాశనం చేసేందుకు నీకు మనస్సు ఎలా వచ్చింది పోచా అని బైరెడ్డి అన్నారు. 110 ఏళ్ల సుధీర్గ కాలం నంద్యాలకే కాకుండా దేశ, విదేశాలలో నాణ్యమైన విత్తనాలు అందిస్తూ ఇటు రైతు లకు, అటు దేశానికే సేవ చేస్తున్న నంద్యాల ఆర్ఏఆర్ఏఎస్‌ను కక్షగట్టి శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు రైతులకు దక్కకుండా చేసిన ఘనత అయనకే దక్కుతుందన్నారు. ఎంపీ పదవి అడ్డుపెట్టుకొని నీ సొంత ఆస్తులు పెంచుకునేందుకు ఉపయోగపడింది గానీ నంద్యాల పార్లమెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి పాటు పడలేదని ఆరోపించారు. రైతులను మోసం చేసినోడు ఎప్పటికి బాగుపడలేదని, దేశానికి అన్నం పెట్టె రైతుకడుపు పొట్టవద్దని బైరెడ్డి హితవు పలికారు. రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా జీవో 365 తెచ్చిన జగన్ ను ఎందుకు నిలధీయలేదని, పార్లమెంట్లో నంద్యాల అభివృద్ధి కోసం ప్రశ్నించావా? అని నిలదీశారు. నీ ఆసుపత్రికి అడ్డు ఉన్నాయని బొగ్గులైన్ నిరుపేదల గుడిసెలు తీయించావన్నారు. అధికార బలంతో నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పోచాను బైరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కూటమి గెలుపుని ఎవరు అడ్డుకోలేరు

**పెమ్మసాని చంద్రశేఖర్**



**పెదకాకాని, ఏప్రిల్ 25 (జనస్వరం) :** ఉమ్మడి కూటమి గెలుపును ఎవరు అడ్డుకోలేరని గుంటూరు నియోజకవర్గం పార్లమెంట్ ఉమ్మడి కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆటోనగర్లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని చారిత్రాత్మక అవసరంతో ఏర్పడిన టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి కూటమి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టీడీపీతోనే ఆటోనగర్ అభివృద్ధి.. గత వైసీపీ ప్రభుత్వంలో ఆటోనగర్ అభివృద్ధిని విస్మరించారని, ఎంతో మంది జీవనోపాధి పొందుతున్న మోటారు వర్కర్లపై ఎమ్మెల్యే ముస్తఫా చిన్న చూపు చూశారని, కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఆరోపించారు. మౌలిక సదుపాయాలు లేక ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ ప్రభుత్వంలో హామీలు మాత్రం ఇచ్చారు కానీ ఇటు వైపు రాలేదని విమర్శించారు. అదే విధంగా ముస్లిం మైనార్టీలను వైసీపీ వారు పట్టించుకోలేదని, గతంలో ముస్లిం మైనారిటీలను టీడీపీ ప్రభుత్వం అనేక రాజకీయ పదవులు ఇచ్చిందని తెలిపారు. రాష్టాభివృద్ధి కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని పేర్కొన్నారు. కూటమి తూర్పు నియోజకవర్గం అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ ఆటోనగర్ వ్యాపారులకు, మెకానిక్ లకు అండగా ఉంటామని తెలిపారు. దుకాణాలు లేని వారికి కొత్తగా దుకాణాలు నిర్మించి ఇస్తామని తెలిపారు. వేలమంది జీవనోపాధి పొందుతున్న ఆటోనగర్లో తిరిగి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, రావి వెంకట రమణ, టీడీపీ నాయకులు షబ్బీర్, ముజీబ్, దేగల ప్రభాకర్, భారత్ రెడ్డి, ఉగ్గిరాల సీతారామయ్య, గౌస్, ఆటోనగర్ నాయకులు అబ్దుల్లా, ఖలీల్, భాషా, ముకబుల్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# వుడ్ ఈజ్ గుడ్ ఇంటర్ కాలేజీ డిజైన్ పోటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనస్వరం) :** బ్రిటిష్ కొలంబియా (బి.సి) ప్రావిన్షియల్ ప్రభుత్వ క్రౌన్ కార్పొరేషన్, ఫారెస్ట్రీ ఇన్నోవేషన్ కన్సల్టింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్ఐఐ ఇండియా), కెనడియన్ వుడ్ గా ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్ లోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ అఫ్ ఆర్కిటెక్చర్ (ఎస్వీసిఏ) సహకారంతో వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా వుడ్ ఈజ్ గుడ్ ఇంటర్ కాలేజ్ డిజైన్ పోటీని నిర్వహించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్‌లో ఎనిమిది ప్రతిష్టాత్మక ఆర్కిటెక్చర్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపక సభ్యులను ఒకేచోట చేర్చింది. ఎస్వీసిఏతో భాగస్వామ్యం చేయడం ద్వారా, కెనడియన్ వుడ్ వర్ధమాన నిర్మాణ విద్యార్థులకు ఆచరణాత్మకంగా బహిర్గతం చేయటం లక్ష్యంగా చేసుకుంది. అదే సమయంలో, స్థిరమైన పదార్థంగా కలప ఉపయోగాలను గురించి అవగాహన కల్పిస్తుంది. వెస్ట్రన్ హేమ్లాక్ కలపను వుపయోగించి ప్రత్యేకమైన ఫర్నిచర్ ఉత్పత్తులను రూపొందించే పనిలో పాల్గొనే కళాశాలల జట్లకు అప్పగించారు. వైష్ణవి స్కూల్ అఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, అరోరా డిజైన్ ఇన్స్టిట్యూట్ జెబిఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్, దక్కన్ స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ తదితర కార్యక్రమాలు పాల్గొన్నాయి. కెనడియన్ వుడ్ గురించి వర్ధమాన వాస్తు శిల్పులకు అవగాహన కల్పించే ఒక దృష్టిలో కూడిన ప్రయత్నంలో పోటీ రెండు విభాగాలు - నిల్వ క్యాబినెట్‌లు, కుర్చీలు చుట్టూ నిర్మించబడినది. పాల్గొనే ప్రతి కళాశాల నుంచి రెండు గ్రూపులు పాల్గొన్నాయి. మొత్తం 16 గ్రూపులు పోటీలో వున్నాయి. ఈ సెటప్ విద్యార్థులకు కెనడియన్ వుడ్ ప్రత్యేక లక్షణాలు, సామర్థ్యాన్ని అన్వేషించటానికి మరియు ప్రదర్శించటానికి ఒక బలమైన ప్లాట్ఫారం అందించింది. భవిష్యత్ ప్రాజెక్టులలో ఈ స్థిరమైన మెటీరియల్‌ను ఏకీకృతం చేయటానికి వారు బాగా సన్నద్ధమయ్యారని నిర్ధారిస్తుంది.

# స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే చంద్రబాబు ధ్యేయం

- సంక్షేమం అభివృద్దే నా లక్ష్యం
- నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి
- అర్హులైన ప్రతి ఒక్కరికి స్థలాలు, ఇళ్ళు
- మార్టూరు ఎన్నికల శంఖారావంలో ఎమ్మెల్యే ఏలూరి



**పర్చూరు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** పేదరికం లేని సమాజం కోసం, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే, టీడీపీ అధినేత చంద్రబాబు ధ్యేయమని, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరులోని నేతాజీ నగర్, రాంనగర్ ఎన్నికల శంఖారావం లో భాగంగా, విస్తృత ప్రచారం నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో, అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. అభివృద్దే, సంక్షేమమే లక్ష్యంగా, విశేష కృషి చేశానని, మళ్లీ అభివృద్ధిని పునః ప్రారంభిస్తానన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి స్థలాలు, ఇళ్ళు ఇచ్చేందుకు తొలి ప్రాధాన్యతనిస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే, నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి, రెండు సెంట్ల స్థలం ఇచ్చేందుకు, అధినేత చంద్రబాబు అంగీకరించారని పేర్కొన్నారు. రాష్ట్రానికి పట్టిన శని కొద్దిరోజుల్లోనే వదిలిపో తుందన్నారు. రాష్ట్రానికి రా నున్నది నవశకమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి రావడం ఖాయం అన్నారు.

**అడుగడుగునా నీరాజనాలు**

మార్టూరు నేతాజీ నగర్, రాంనగర్‌లలో, ఎమ్మెల్యే ఏలూరికి అడుగడుగునా, ప్రజలు నీరాజనం పలికారు. తొలుత శివాలయం వద్ద, అద్దేటి అనిల్ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే ఏలూరికి గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై, హారతులు ఇస్తూ వీర తిలకం దిద్దారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో, జరుగుతున్న అన్యాయాన్ని వివరించేలా, రూపొందించిన కరపత్రాలను అందజేశారు. ఐదేళ్లలో రాష్ట్రం నష్టపోయిన విధానాన్ని, కళ్లకు కట్టినట్లు వివరించారు. రానున్న ప్రజా కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను, ప్రజలకు వివరించారు. ప్రజలు ఎమ్మెల్యే ఏలూరికి బ్రహ్మారథం పట్టారు.

# జన సునామిని.. తలపించిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యంయం కొండయ్య నామినేషన్

- జనసంద్రమైన చీరాల ప్రధాన వీధులు
- అట్టహాసంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యంయం కొండయ్య నామినేషన్ మహోత్సవం
- అడుగడుగునా జన.. నీరాజనం...
- జనసంద్రంలా కనుల పండువగా సాగిన భారీ ర్యాలీ
- ర్యాలీలో కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- అశేష జనవాహిని మధ్య కిక్కిరిసిన గడియార స్తంభం సెంటర్
- అడుగడుగునా భారీ గజమాలలతో ఘన స్వాగతం
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాల, ఘన నివాళి
- అలరించిన డప్పు నృత్యాలు
- ర్యాలీలో పాల్గొన్న కూటమి చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య, ఎమ్మెల్సీ అనూరాధ, సినీ హీరో నిఖిల్
- మండుటెండను సైతం లెక్క చేయని అభిమానం
- ప్రత్యర్థులను హడలెత్తించిన కొండయ్య నామినేషన్ పర్వం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ హీరో నిఖిల్, కొండయ్య తనయులు





**చీరాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యంయం కొండయ్య, వేలాదిమంది అభిమానులతో భారీ ర్యాలీగా వెళ్లి, గురువారం అట్టహాసంగా, నామినేషన్ దాఖలు చేశారు. కొండయ్య నామినేషన్‌కు, వేలాది మంది ప్రజలు రావడంతో, జాంద్రపేట హస్తినాపురం నుండి గడియార స్తంభం సెంటర్‌కు చేరుకోవడానికి, మూడు గంటలకు పైగా సమయం పట్టింది. నామినేషన్ దాఖలు చేసేందుకు వెళుతున్న కూటమి అభ్యర్థి కొండయ్యకు, అడుగడుగునా క్రేన్‌ల సహాయంతో, భారీ గజమాలలు వేసి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీగా హాజరైన ప్రజలనుద్దేశించి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యం.యం. కొండయ్య మాట్లాడుతూ, సీఎంగా విజన్ ఉన్న నేత చంద్రబాబు రావడం, ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో అత్యవసరమని, అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టాలన్నా, భావితరాల వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాలన్నా, విజనరీ ఉన్న నేత చంద్రబాబు అవసరం ఎంతో ఉందన్నారు. భావితరాల యువత ఉజ్వల భవిష్యత్తు కోసం, ప్రతి ఒక్కరు చంద్రబాబును సీఎంని చేయటమే లక్ష్యంగా, కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాత్రమేనని, వైసీపీ వారు పెట్టే, బేడా సర్దుకుని పోవాల్సిందేనన్నారు. చీరాల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే అత్యుత్తమ నియోజకవర్గంగా, నిలబెట్టే బాధ్యత తనదని స్పష్టం చేశారు. తనను ఆదరించి, గెలిపించాలని కొండయ్య చీరాల నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, అఖండ మెజారిటీతో కొండయ్య విజయం సాధిస్తారని, దీనికి నిదర్శనమే వేలాదిగా తరలి వచ్చిన జన సంద్రం అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, చీరాలలో కూటమి అభ్యర్థి కొండయ్య గెలుపు తథ్యమన్నారు.

**ప్రత్యేక పూజలు**

నామినేషన్ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యం.యం.కొండయ్య, కుటుంబ సభ్యులతో కలిసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పటికే హస్తినాపురం ఆలయం వద్దకు, వేలాదిమంది అభిమానులు చేరుకోవడంతో, ఓపెన్ టాప్ వాహనం ఎక్కి ర్యాలీగా, జాంద్రపేట హస్తినాపురం, సిపా యి పేట,సాల్మన్ సెంటర్, ప్రసాద్ థియేటర్ సెంటర్, కొట్లబజార్, ముంతా వారి సెంటర్‌ల మీదుగా, గడియార స్థంభం సెంటర్ వద్దకు చేరుకుని, కూటమి ఎమ్మెల్యేఅభ్యర్థి యంయం కొండయ్య, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రసంగించారు.

**అంచనాలకు మించి ప్రజల రావడంతో కిక్కిరిసిన రోడ్లు**

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యం.యం. కొండయ్య నామినేషన్‌కు, 25 వేలనుండి 30వేల మంది, అభిమానులు వస్తారని అంచనాలు ఉండగా, దీనికి మించి సుమారు 50వేలకు పైగా, ప్రజలు రావడంతో చీరాల జనసంద్రంగా మారి ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. వైసీపీని తరిమికొట్టేందుకు, కూటమిని గెలిపించేందుకు మేము సంసిద్ధం అంటూ, ప్రజలు చేసిన నినాదాలతో చీరాల ప్రాంతం మార్మోగిపోయింది. హస్తినాపురం విఘ్నేశ్వరస్వామి వారి ఆలయం నుండి, గడియార స్థంభం సెంటర్ మీదుగా, ఆర్‌డిఓ కార్యాలయం వరకు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యం.యం.కొండయ్య నామినేషన్ దాఖలు సందర్భంగా, జరిగిన ర్యాలీ జన సునామీని తలపించి, ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. ప్రత్యర్థులు హడలిపోయేలా హాజరైన జనసంద్రాన్ని చూసి, గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి జనసునామిని చూడలేదని, రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కొండయ్య నామినేషన్‌తో టీడీపీ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపించింది.

– హడలెత్తిపోయిన ప్రత్యర్థులు నామినేషన్ మహోత్సవానికే, రోడ్లన్నీ కిక్కిరిసి పోవడంతో, అధికార పార్టీ వారు, ప్రత్యర్థులు హడలెత్తిపోయారు. జన సంద్రాన్ని చూసిన రాజకీయ విశ్లేషకులు, కూటమి అభ్యర్థి కొండయ్య గెలవడమే కాదు.. అంచనాలను తలకిందులు చేసేలా, అఖండ మెజారిటీని కొండయ్య సాధించేది ఖాయమని విశ్లేషిస్తున్నారు.

– ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ హీరో నిఖిల్, కొండయ్య తనయులు

సినీ హీరో నిఖిల్, కొండయ్య తనయులు అమర్నాథ్, మహేంద్ర నాథ్‌లు, ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆద్యంతం నాయకులను, కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ, ర్యాలీలో సందడి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కీలక నేతలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరికి మద్దతుగా టీడీపీలోకి వైసీపీ నేతలు

- పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరికలు
- అందరూ కలిసి రండి, అభివృద్ధిని పునః ప్రారంభిద్దాం
- నేతలతో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు.

ఎమ్మెల్యే ఏలూరి



**పర్చూరు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా పర్చూరు నియోజకవర్గంలో, భారీ సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు మద్దతు తెలిపి, టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా, ఇప్పటికే వేలాదిమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో, టీడీపీలో చేరారు. టీడీపీలోకి వైసీపీ నుండి వలసల పరంపర రెండునెలలుగా కొనసాగుతుంది. పార్టీలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి చేస్తున్న అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, మంచి మనస్సు, ఆయన ఆప్యాయత, అనురాగాలకు మంత్రముగ్ధులవుతున్నారు. గురువారం మార్టూరు, పెద్దగంజాం, ఉప్పుటూరు, గర్నెపూడి, కోనంకి గ్రామాల నుంచి, వందలాది మంది, టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి, టీడీపీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర పునర్నిర్మాణం, భావితరాల భవిష్యత్తు కోసం, ప్రతి ఒక్కరు టీడీపీతో, కలిసి రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమాలే, టీడీపీ లక్ష్యమన్నారు. వైసీపీ పాలనలో అరాచకం, విధ్వంసం, దౌర్జన్యం దోపిడి తప్ప, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలంతా భావితరాల భవిష్యత్తు కోసం, ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజాకూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

**టీడీపీలో చేరిన పెద్దగంజాం వైసీపీ నేతలు**

పెదగంజాంకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పలు వురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో, టీడీపీలో చేరారు. వారిలో భీమవరపు సుంద రకొండ, ఆముదాలపల్లి శివ, భీమవరపు రాములు, ఆముదాలపల్లి గోపి, భీమవరపు శ్రీను, మాటూరి రామ చంద్ర, ఆముదాలపల్లి అంకమ్మరావు, భీమవరపు శ్రీనివాసరావు, ఆముదాలపల్లి మురళి, భీమవరపు కోటయ్య, భీమవరపు వెంకటేష్, నూతక్కి కోటేశ్వరరావులు ఉన్నారు.

**ఉప్పుటూరు నుండి చేరికలు**

ఉప్పుటూరుకు చెందిన పలువురు వైసీపీ నేతలు, ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో, టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో పాలేరు శివ నాగేశ్వరరావు, షేక్ కరిముల్లా, ఉరుమ కుమార వీరభద్రరావు, కొమ్మన బోయిన కోటయ్య, షేక్ ఖాసిం బుడేలు ఉన్నారు.

**మార్టూరు నుండి చేరికలు**

మార్టూరు నగరానికి చెందిన పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉయ్యాల ఆంజనేయులు, పాలపర్తి రత్తయ్య, పాలపర్తి నాగరాజు, పాలపర్తి కోటేశ్వరరావు, అలపర్తి వీరబ్రహ్మం,ఉయ్యాల నరేం ద్ర, పేరం అనిల్‌లు, ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

**మార్టూరు నుండి చేరికలు**

మార్టూరు తూర్పు బజార్‌కు చెందిన దగ్గుబాటి సుధాకర్, దగ్గుబాటి సురేష్, మక్కెన రమణ, కోటి శ్రీనివాసరావు, దాసి రక్షణ టీడీపీలో చేరారు. అలాగే కోనంకి పఠాన్ నాగూర్ వలి టీడీపీలో చేరారు.

**గర్నెపూడి నుండి చేరికలు**

గర్నెపూడి గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ వలీ, షేక్ ఖాసిం బుడే, పఠాన్ నాగూర్ మీరషా, షేక్ నాగూర్ వలి, పఠాన్ సుభాని, కోరిటాల ఈశ్వరచంద్ర సాగర్‌లకు, ఎమ్మెల్యే ఏలూరి టీడీపీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు.

## అట్టహాసంగా జగన్ నామినేషన్ దాఖలు



**పులివెందుల ఏప్రిల్ 25 (జనస్వరం) :** వైయస్సార్ జిల్లా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ అభ్యర్థిగా సీఎం జగన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆ మేరకు ఆయన నామినేషన్ పత్రాలను స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకటేషులకు సమర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, వైసీపీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డిలు ఉన్నారు.

## 27న విద్యుత్ సరఫరా అంతరాయం

**పాడేరు డివిజనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి అప్పారావు**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల పరిధిలోని 33 కెవి విద్యుత్ మరమ్మతు చేపట్టందుకు గాను ఈనెల 27న విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని పాడేరు డివి జనల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ అధికారి ఏవిఎన్ఎమ్ అప్పారావు గురువారం తెలిపారు. గడిచిన రెండు రోజుల క్రితం ఉరుముల మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించడంతో లమ్మసింగి బోడ కొండమ్మ ఘాటిలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు మరమ్మతులకు గురి కావడంతో వాటిని మరమ్మత్తు పనులు చేపట్టేందుకు శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ మరమ్మత్తు పనులు చేపట్టడంతో పోలింగ్ రోజున విద్యుత్ అంతరా యం లేకుండా ప్రత్యేక ప్రణాళిక ద్వారా విద్యుత్ సరఫరాకు అన్ని విధాలుగా ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఉదయం 9 గంటల మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మత్తు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 27న విద్యుత్తు నిలుపుదల నిర్వహించడం జరుగు తుందని, చింతపల్లి, గూడెం కొత్త వీధి మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

## మానసిక ఉల్లాసానికి దోహదపడేవి క్రీడలు

**సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎంపీపీ అనూష దేవి సర్పంచ్ పుష్పలత**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత తో కలిసి ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ద యూనిటీ కప్ సెకండ్ సిరీస్ హార్డ్ టెన్నిస్ బాల్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా క్రీడాకారులను వారు పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు దాతలు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించారన్నారు. ఈ టోర్నమెంట్ లో ప్రథమ విజేతకు 50 వేల రూపాయలు, ద్వితీయ విజేతకు 20 వేల రూపాయల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు అదే క్రమంలో నల్లల శివ సాయి వీడిఎస్ ఆర్థిక సహకారంతో విన్నర్ ట్రోఫీ, కేపీ రాజు ఆర్థిక సహాయంతో రన్నర్ ట్రోఫీ, స్థానిక ఎంపీటీసీ దారలక్ష్మి, మత్యరాజు దంపతుల ఆర్థిక సహాయంతో బెస్ట్ టీం ట్రోఫీ లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు ఎంపీపీ అనూష దేవి 20వేల రూపాయలు, సర్పంచ్ పుష్పలత, హేమంత్ దంపతులు పదివేల రూపాయలు, స్థానిక ఇంజనీరింగ్ జేఈలు (జ్యోతి బాబు, లోకేష్ లు) 20వేల రూపాయలు, ప్రసాద్, నాగేంద్ర లు సంయుక్తంగా పదివేల రూపాయలు అందించారని, అదేవిధంగా టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన వివిధ అవసరాలను గ్రామంలోని యూత్ సమకూర్చాలని వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు, అధ్యాపకులు లీలా పావని, కేజియా, సంతోషి, రమణ, బాలరాజు, జగదీష్ బాబు, నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## దోమతెరలు వాడండి.. దోమ కాటుకు రక్షణ పొందండి

- ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటిద్దాం
- చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్




**చింతపల్లి ఏప్రిల్ 26 (జనస్వరం) :** దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు దోమతెరలను వినియోగించుకొని దోమ కాటుకు రక్షణ పొందాలని చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పీలేరు చింతపల్లి సబ్ యూనిట్ అధికారులు ఆర్ కన్నబాబు, బి చిట్టిబాబుల పర్యవేక్షణలో చింతపల్లి ఏరియా ఆసుపత్రి నుంచి అంబేద్కర్ కూడలిలో మానవహారం నిర్వహించి అక్కడి నుంచి జంక్షన్ వరకు ఇంకుడు గుంతలలో నీటి నిలువలు దోమలకు ఆవాసాలు, వేపాకు పొగ దోమలకు సెగ, దోమ పుట్టరాదు దోమ కుట్టరాదు, దోమల నియంత్రణ మన అందరి బాధ్యత, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోండి, దోమల వ్యాప్తిని అరికట్టండి, మలేరియా రహిత ప్రపంచమే మన లక్ష్యం, దోమతెరలు వాడుదాం దోమ కాటు నుంచి రక్షణ పొందుదాం అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు రోజుల క్రితం చిన్నపాటి వర్షాలు పడడంతో జ్వరాలు ప్రభలే అవకాశాలు ఉన్నాయని, దగ్గు జలుబు తలనొప్పి జ్వరం సంభవిస్తే ఆశ కార్యకర్త, ఏఎన్ఎం సహకారంతో దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తరలివెల్లి రక్త పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. చిన్నపాటి జ్వరాలే కదా అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలపై ముప్పు వాటిలో ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో జాన్సన్, మలేరియా సూపర్వైజర్ శ్రావణి సంధ్య, హెల్త్ సూపర్వైజర్ శాంత కుమారి, ఎంఎల్‌హెచ్‌పిఈ లక్ష్మి, ఏఎన్ఎంలు కే.విజయలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, లక్ష్మణరావు, ప్రకాష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా బత్తుల నామినేషన్





**ప్రత్తిపాడు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** పత్తిపాడు బార్ అసోసియేషన్ ఎన్నికలలో అన్నవరానికి చెందిన బత్తుల రవికుమార్ జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా గురువారం సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదుల సమక్షంలో నామినేషన్ వేశారు. బార్ అసోసియేషన్ అభివృద్ధి కొరకు, మౌలిక సదు పాయాల కొరకు బార్ సీనియర్లు సలహాలతో జూనియర్ న్యాయవాదుల సహకారంతో బార్ అసోసియేషన్‌కి తోడ్పాటు అందిస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానని బత్తుల రవికుమార్ వెల్లడించారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నాకు అవకాశం కల్పించవలసిందిగా న్యాయవాదులను అభ్యర్థిస్తున్నానని తెలిపారు.

## నిత్య కళారాధన వేదికపై నృత్య ప్రదర్శన




**శ్రీశైలం, ఏప్రిల్ 25 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా గురువారం సాయంత్రం సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దక్షిణామాడ వీధిలోని నిత్యకళారాధన వేదికపై శ్రీ లక్ష్మిగణపతి కల్చరల్ ఆర్గనైజేషన్ సికింద్రాబాద్ వారిచే మహాగణపతిం, భో.. శంభో, హరిహర గజముఖ, శివాష్టకం తదితర గీతాలకు వైష్ణవి, అక్షయ, రిత్విక, చైత్రశ్రీ, కీర్తన తదితరులు నృత్యప్రద ర్శన చేసి భక్తులను ఆకట్టుకున్నారు. నిత్యకళారాధనలో ప్రతిరోజు వివిధ రకాల సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించబడతాయని కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పేర్కొన్నారు.

# హిందీ టీచర్‌ను ఉద్యోగం నుంచి తొలగించిన విద్యాశాఖ



**నంద్యాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** ఎలాంటి ఆధారాలు లేకుండా ఉద్యోగం నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి తొలగించాడని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల విద్యాశాఖకు సంబంధించిన అవినీతి అక్రమాలపై స్కూళ్లకు, ఎం.ఆర్.సి లకు మంజూరైన నిధులను దోచుకుంటున్న హెచ్.ఎంలపై, ఎంఈఓలపై, తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై, విధులపట్ల నిర్లక్ష్యం చేస్తూ ఇతర వ్యాపకాలపై బిజీ ఉన్న వారిపై, స్కూళ్ళలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిపై, బదిలీల్లో మోసాలకు పాల్పడుతున్న వారిపై సమాచారం సేకరించి ఫిర్యాదులు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బాగు చేస్తున్న సతీష్ కుమార్ మాకు వద్దు అంటూ, తప్పులు చేసే వారే మాకు ముద్దు అంటూ వారిని ఉద్యోగాల్లో కొనసాగిస్తున్నారని నంద్యాల బహుజన టీచర్స్ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హిందీ టీచర్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె.సతీష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే గతంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ చేసిన పిర్యాదులలో పనిష్మెంట్లు పొందిన కొందరు టీచర్లు వారికి వత్తాసు పలికే మరి కొందరు కలిసి ఒక తప్పుడు అడ్రస్ లేని ఫిర్యాదు చేస్తే, దానిని ఆధారం చేసుకొని సమాచార హక్కు చట్టం దుర్వినియోగం చేస్తున్నానని సాకు చూపుతూ అక్రమంగా సస్పెండ్ చేసిన సంఘటన విదితమే. అంతే కాకుండా సుదూర ప్రాంతాల్లో అక్రమంగా పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చి వేధిస్తున్నారని పాఠశాల విద్యాశాఖ కమీషనర్‌కు 2022సెప్టెంబర్ 1వ తేదిన పిర్యాదు చేయడం జరిగిందన్నారు. జీ.ఓ.నం.77, ప్రకారం గడివేముల మండలం, బిలకలగూడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో కానీ, జీ.ఓ.నం.189, ప్రకారం సస్పెండ్ చేసిన కోవెలకుంట్ల మండలం, రేవనూరు ఉన్నత పాఠశాలలో కానీ, ఆంధ్రప్రదేశ్ ఎస్.సి కమీషన్ వారు, ప్రస్తుత కడప ఆర్జేడీ రాఘవ రెడ్డి సూచించిన నంద్యాల పరిసర ప్రాంతాలలో కానీ పోస్టింగ్ ఇవ్వాలని కోరినా పట్టించుకోకుండా కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది కలిసి పెడచెవినబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నేను చేసిన ఫిర్యాదుపై 19 నెలల తర్వాత విచారణ చేసిన రాష్ట్ర అధికారులు రిపోర్టు ఇవ్వకముందే, ఒక పథకం ప్రకారం తయారు చేసిన నంద్యాల ఉపవిద్యాశాఖాధికారీ మహమ్మద్ బేగ్, 10 మంది టీచర్లు కలిసి తయారు చేసుకొని ఇచ్చిన ఒక తప్పుడు మోసపూరిత నివేదిక ఆధారంగా ఉద్యోగం తొలగించారని తెలిపారు. సమస్య రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పరిధిలో ఉండగా, కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అత్యుత్సాహం కనబరుస్తూ, మహమ్మద్ బెగ్ ఇచ్చిన తప్పుడు విచారణ నివేదిక చెల్లదని, ఆ నివేదిక ఆధారంగా ఇచ్చిన షోకాజ్ నోటీసు కూడా చెల్లదని, తనపై తయారు చేసిన తప్పుడు ఫైలు ఆధారంగా విచారించి న్యాయం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి పలుమార్లు విజ్ఞాపన చేసుకున్నా కూడా వాటిని పెడచెవిన పెడుతూ ఏకపక్షంగా ఉద్యోగం నుండి తొలగించడంపై సతీష్ కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఈ విషయంలో చట్ట, న్యాయ పరిధిలో ఫిర్యాదు చేస్తానని ఇందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన అందరిపై కూడా పిర్యాదు చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో బిటీఎఫ్ నాయకులు జయపాల్, జగదీష్, సంజీవ్, మౌలిబాష, సుబ్బారావు, శేఖర్ విజయారాణి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెపల్లెకు ప్రచారంలో నరేంద్ర వర్మకు ప్రజల బ్రహ్మ రథం



**బాపట్ల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** బాపట్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ రాజు, ఖాజీపాలెం, పోతనకట్టవారి పాలెం, చెర్లోపాలెం, ఏటికట్ట గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. పల్లె, పల్లెనా ప్రజలు వేగేశన నరేంద్ర వర్మరాజుకి బ్రహ్మ రథం పట్టారు. స్థానిక సమస్యలపై ఆయన మాట్లాడుతూ, సాగునీరు, తాగునీరు, వీధి లైట్లు, పంట కాలువల నిర్వహణ, మురుగు కాలువల ప్రక్షాళన, మొదలగు సమస్యల పరిష్కారానికి, శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే? సైకిల్ గుర్తుకి ఓటేసి టీడీపీ, బీజేపీ, జనసేన, పార్టీలు, బలపరిచిన నరేంద్ర వర్మ రాజు అనే తనను గెలిపించాలని, ప్రజలను అభ్యర్థించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, కుల మతాలకతీతంగా, అన్ని వర్గాలకు సంక్షేమం, పథకాలను అందించాలనే ధ్యేయంతో, సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారని, సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, పథకాలను అమలుచేసి ప్రజల జీవితాల్లో కొత్తవెలుగులు నింపుతామని, వేగేశన నరేంద్ర వర్మరాజు ప్రజలకు హామీ ఇచ్చారు. చంద్రన్న సూపర్ సిక్స్ పథకాలే కాకుండా, ఈ ప్రాంతం బిడ్డగా లోకల్ మేనిఫెస్టోను సిద్ధం చేసి, అధ్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, మొదలగు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, వేగేశన ప్రజలకు భరోసా ఇచ్చారు. అలాగే బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు బలపరిచిన ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ని సైకిల్ గుర్తుపై ఓటేసి, ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన శివన్నారాయణ, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా దత్తాత్రేయస్వామికి పూజలు



**శ్రీశైలం ఏప్రిల్ 25 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలో గురువారం ఉదయం దత్తాత్రేయస్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. లోకకల్యాణం కోసం ప్రతి గురువారం దేవస్థానం సేవగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వేంచేబు చేసివున్న శ్రీదత్తాత్రేయ స్వామికి విశేషపూజలు నిర్వహిస్తారు. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపి ంచి తదుపరి దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష పూజల అనంతరం ప్రత్యేక హార తులు సమర్పించారు. లోకొద్దరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపంలో దత్తాత్రే యునిగా అవతరించారని అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్దుడని పురాణాలు చెబుతున్నాయి.

## ఇండిపెండెంట్ అభ్యర్థిగా శెట్టిబత్తుల ధర్మరాజు నామినేషన్



**పాయకరావుపేట, ఏప్రిల్ 25 (జనస్వరం) :** పాయకరావుపేట ఎస్సీ రిజర్వడు నియోజకవర్గ ఇండపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్ రాయవరం మండలం, పెద గుమ్ములూరు గ్రామానికి చెందిన శెట్టిబత్తుల ధర్మరాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అఫిడవిట్‌తో కూడిన ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి కె.గీతాంజలికి సమర్పించారు. ఈ సందర్భంగా ధర్మరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్యాభ్యాసం చేసిన తాను, చాలా కాలం నుంచి సోషల్ వర్కర్‌గా నియోజకవర్గ ప్రజలకు సేవలు అందజేస్తున్నానని చెప్పారు. స్థానికుడునైన తనకు పాయకరావుపేట నియోజకవర్గ పరిస్థితులు, ఇక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. రాజకీయాలపై చాలా కాలం నుంచి ఆసక్తి ఉందని, నియోజకవర్గ ప్రజలు తనకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ ప్రజలకు నిస్వార్ధంగా సేవ చేస్తానని ధర్మరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మరాజు మద్దతుదారులు బొడ్డపాటి రమేష్ బాబు, బండారు శివ ప్రసాద్, దిరిశాల కృష్ణంరాజు, కొత్తపల్లి అప్పారావు పాల్గొన్నారు.

## విజయవాడ పశ్చిమలో సుజనా ప్రచార జోరు



**విజయవాడ, ఏప్రిల్ 25 (జనస్వరం) :** స్థానిక నియోజకవర్గం 47వ డివిజన్లో గురువారం ఎన్డీఏ కూటమి అభ్యర్థి సుజనా చౌదరి ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో చాలా వరకు కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల సమస్యలను తెలుసుకుని వాళ్ళ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని, తనకు భగవంతుడు చాలా ఇచ్చాడని, తాను జన్మించిన ఈ కృష్ణా జిల్లా వాసులకు సేవ చేసుకునే అవకాశాన్ని ఇవ్వాలని కోరారు. డివిజన్లో ఉన్న ప్రతి ఒక్క ఇంటిని కలిసి వారి ఇంట్లో ఒక పెద్ద కొడుకు లాగా భావించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

## కోలాహలంగా పి .గన్నవరం కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు నామినేషన్

**- కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో జనసంద్రంగా మారిన పి.గన్నవరం**



**మామిడికుదురు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** పి.గన్నవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైసీపీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం నామినేషన్ దాఖలు చేశారు.నగరం గ్రామంలో తన నివాసం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ప్రచార రథంపై కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థి జంగా గౌతమ్‌తో కలసి ప్రజలకి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా కొండేటి ఫాలోవర్స్ ఆధ్వర్యంలో యువత, అభిమానులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో తరలివచ్చి కొండేటికి మద్దతు పలికారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలాపురం పార్లమెంట్ అభ్యర్థి జంగా గౌతమ్, పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు ఎన్నికల గుర్తు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని వారు కోరారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు తాను చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తనకి మరొక అవకాశం కల్పించాలని కొండేటి కోరారు. ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం సంతరించుకొంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి, మహమ్మద్ ఆరిఫ్, జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకర్, నియోజకవర్గంలోని నాలుగు మండల శాఖల అద్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ, చిట్టాల రామ జోగేశ్వరరావు,నెల్లి వెంకట రమణ, లంక వెంకటరామ శాస్త్రి, మాచవరపు శివన్నారాయణ, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, బొంతు రాజేంద్ర, చిట్టూరి శ్రీనివాస చౌదరి, గెడ్డం వెంకటేశ్వరరావు, నీతిపూడి బాల సత్యనారాయణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చీరాలలో సినీ హీరో నిఖిల్ సందడి

**కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎం. కొండయ్యని గెలిపించాలని పిలుపు**



**చీరాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** ప్రముఖ సినీ హీరో, కార్తికేయ ఫేమ్ నిఖిల్ చీరాలలో సందడి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చీరాల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎం. కొండయ్యకు వరుసకు అల్లుడు అయిన నిఖిల్, మామ కొండయ్యకు మద్దతుగా, గురువారం జరిగిన కొండయ్య నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు, కొండయ్యని గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ఎమ్మె ల్యే అభ్యర్థి కొండయ్య నామినేషన్ ర్యాలీకి, జనసునామీని తలపించేలా, భారీగా హాజరైన జనం సినీ హీరో నిఖిల్ మాటలను ఎంతో ఆసక్తిగా విన్నారు. కూటమి అభ్యర్థి కొండయ్యని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని, ప్రజలు పెద్ద పెద్దగా నినాదాలు చేస్తూ, తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.

## పేదవాడి ప్రభుత్వం ఏర్పాటుతోనే గ్రామాల అభివృద్ధి సులభం

**కొత్తపాలెం సచివాలయం కన్వీనర్ బెన్నిబాబు**



**చింతపల్లి, ఏప్రిల్ 26 (జనస్వరం) :** రాష్ట్రంలో పేదవాడి ప్రభుత్వం ఏర్పాటుతోనే గిరి గ్రామాల అభివృద్ధి సులభతరం అవుతుందని కొత్తపాలెం సచివాలయం కన్వీనర్ వనగల బెన్నిబాబు అన్నారు. కన్వీనర్లు, గృహ సారధులతో కలిసి కప్పలు, మూలగొంది తదితర గ్రామాలలో సందర్శించి అరకు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి గుమ్మ తనుజారాణి, పాడేర వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు గెలుపునకు ప్రజలందరూ ఆయుధంగా తరలివచ్చి ఫ్యాను గుర్తుపై ఓటు హక్కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుర్తు చేశారు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగానే మారుమూలగిరి గ్రామాలకు విద్యా వైద్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు నోచుకోలేదని, వైసీపీ ప్రభుత్వంతోనే ప్రతి పేదవాడికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము సురేష్, కొమ్ము రాంబాబు సుమారు 45 మంది గ్రామ వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

## పర్చూరు నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యం

**కాంగ్రెస్ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి నల్లగొర్ల శ్రీ లక్ష్మి జ్యోతి**



**పర్చూరు, ఏప్రిల్ 25 (జనస్వరం) :** దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసుకురావటమే ధ్యేయంగా, పర్చూరు నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా కృషి చేస్తానని, కాంగ్రెస్ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి నల్లగొర్ల శ్రీ లక్ష్మి జ్యోతి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పర్చూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లగొర్ల శ్రీ లక్ష్మి జ్యోతి, తన భర్త వెంకటరామరాజుతో కలిసి, తన నామినేషన్ పత్రాలను, ఆర్‌ఓకు అందజేశారు. తనను ఆదరించి, గెలిపించాలని, పర్చూరు నియోజకవర్గ ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీగా ఏమి అభివృద్ధి చేశావ్ పోచన్న..?

**- బైరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత ఎంపీ పోచాకు లేదు**

**- ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి**



**నంద్యాల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** నంద్యాల పార్లమెంట్ సభ్యులుగా ఐదేళ్ళు ఏమి అభివృద్ధి చేసావని మళ్ళీ నిన్ను గెలిపించాలని ఎంపీ పోచాని ఉమ్మడి కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి నిలదీసారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాయలసీమ అభ్యున్నతికి తన తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాజీలేని పోరాటం చేస్తున్నారని, రైతులను మోసం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్న మీరు కూడా బైరెడ్డి కుటుంబాన్ని విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బైరెడ్డి శబరి అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రానికి రెండు కళ్లలాంటివని, వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించి నవరత్నాల పేరుతో జగన్ నవమోసాలు చేశారని విమర్శించారు. మళ్ళీ జగన్ ప్రభుత్వం వస్తే రాష్ట్రాభివృద్ధి మరో 30 ఏళ్ళు వెనక్కు వెళ్లడమేనన్నారు. పాలనలో అనుభవం ఉన్న చంద్రబాబు సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు సాగుతుందని బైరెడ్డి శబరి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ పెరిగిపోతోందని, జగన్‌పై ఎన్నో ఆశలుపెట్టుకున్న నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి లేక చెడు అలవాట్లకు బానిసై కుటుంబాలకు మానసిక వేదన కలిగిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందని ఈ ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పబోతున్నారన్నారు. ఎంపీతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉమ్మడి కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## బాపట్ల నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యం

**కాంగ్రెస్ బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి గంటా అంజిబాబు**



**బాపట్ల, ఏప్రిల్ 25 (జనస్వరం) :** దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసుకురావటమే ధ్యేయంగా, బాపట్ల నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యంగా కృషి చేస్తానని, కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు, బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి గంటా అంజిబాబు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా గంటా అంజిబాబు నామినేషన్ పత్రాలను, ఆర్‌ఓకు అందజేశారు. తనను ఆదరించి, గెలిపించాలని, బాపట్ల నియోజకవర్గ ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**ఏలేశ్వరం, ఏప్రిల్ 25 (జనస్వరం) :** కాకినాడ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పూర్తి స్థాయి శాంతి భద్రతల నడుమ రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ క్షేత్ర స్థాయి తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక పోలీసు అధికారులు మరియు సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. గురువారం ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఏలేశ్వరం పోలీసు స్టేషన్ పరిధిలో లింగంపర్తి,తిరుమాలి, పెద్దనాపల్లి గ్రామాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించి పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా స్థానిక పోలీసు అధికారులు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ బాబు, ఏలేశ్వరం ఎస్సై జి.సతీష్ ఉన్నారు.